క్లుప్తంగా

ఆర్మీ జవాన్ల మృతికి గంగపుత్రుల నివాళి

బెల్లంపల్లి: భారత్, పాకిస్తాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంలో అమరులైన భారత వీర జవాన్ల మృతికి గంగపుత్రులు శ్రద్ధాంజలి ఘటించారు. బెల్లంపల్లి తిలక్‌స్టేడియంలో ఆదివారం పట్టణ గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో అమరుడైన మురళీనాయక్, ఇతర జవాన్ల మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో గంగపుత్రుల సంఘం పట్టణ అధ్యక్షుడు వంగల చక్రపాణి, కార్యదర్శి దామెర విజయ్‌కుమార్, నాయకులు బాసబోయిన పోతరాజు, మాదరబోయిన రాజేందర్, మద్దెల శ్రీనివాస్, గరిగే రాజ్‌కుమార్, ముద్ర వెంకటి తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మేకల దాసు

మందమర్రిరూరల్: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను అన్నివర్గాల కార్మిక సంఘాలు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. స్థానిక సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు అక్బర్‌అలీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మిట్టపల్లి పౌల్, సమ్మయ్య, కలీందర్ అలీఖాన్, సత్యనారాయణ, సుదర్శన్ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో జయంతి సందర్భంగా ఆదివారం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.


భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

కాసిపేట: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన భర్త ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. కాసిపేట పోలీసుస్టేషన్ పరిధి సోమగూడెం ట్యాంక్‌బస్తీలో ఉంటున్న గోపె సందీప్(40), భార్య రాజేశ్వరి దంపతులు. పదేళ్ల కుమార్తె ఉంది. కూలీ పనిచేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. రెండేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లి తిరిగిరాలేదు. ఈక్రమంలో మనస్తాపం చెంది ఆదివారం మధ్యాహ్నం గ్రామశివారులోని యాప చెట్టుకు చీరతో ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి

కాసిపేట: బెల్లంపల్లి నియోజకవర్గంలోని చాకెపల్లిలో సోమవారం చేపట్టనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గిరిజన సంక్షేమశాఖ చీఫ్ ఇంజనీర్ ముడిమడుగుల శంకర్ కోరారు. సోమగూడెంలో ఆదివారం విగ్రహావిష్కరణ కరపత్రాలు ఆవిష్కరించారు. మంత్రి సీతక్కతో పాటు ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్ కుమార్‌దీపక్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, అంబేడ్కర్ సంఘాల నాయకులు హాజరవుతున్నారని, అంబేడ్కర్ వాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దాగం మల్లేశ్, ముడిమడుగుల మహేందర్, జంబి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మందమర్రి పట్టణ అధ్యక్షుడిగా నరేశ్


నియామకపత్రం అందుకుంటున్న నరేశ్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా సప్పిడి నరేశ్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ చేతుల మీదుగా నరేశ్ ఆదివారం నియామకపత్రం అందుకున్నారు.



తాటిముంజలకు భలే గిరాకీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/దండేపల్లి: వేసవి తాపాన్ని తీర్చే తాటి ముంజలకు భలే గిరాకీ ఏర్పడింది. వీటిని తినేందుకు చాలా మంది ఎంతో ఇష్టపడతారు. తాటి వనాల వద్ద అందుబాటులో ఉంటాయి. దండేపల్లి మండలం నాగసముద్రం, హాజీపూర్ మండలం పెద్దంపేట తాటి వనం సమీపంలో రోడ్డు పక్కన గీతకార్మికులు తాటిముంజలను అమ్ముతున్నారు. దీంతో వాహనదారులు ఆగి తాటిముంజలను కొనుక్కుని వెళ్తున్నారు.

పట్టపగలే వెలుగులు



చెన్నూర్‌రూరల్: మండలంలోని పొక్కూరు గ్రామంలో హైమాక్స్ లైట్లు పట్టపగలే వెలుగుతున్నాయి. గ్రామ పంచాయితీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇలా అయితే లైట్లు పనిచేయకుండా మారుతాయని ప్రజలు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని పట్టపగలు లైట్లు వెలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కోనోకార్పస్ చెట్లు తొలగించరూ?

భీమారం: మంచిర్యాల-చెన్నూర్ జాతీయరహదారిపై భీమారం వద్ద నాలుగువరసల రహదారి డివైడర్‌లో నాటిన హాని కల్గించే కోనోకార్పస్ చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. వేసవి కాలం కావడంతో రోడ్డు నిర్మాణ సంస్థ లారీలో ట్యాంకర్ ఏర్పాటు చేసి చెట్లకు నీరందిస్తోందని తెలిపారు. ఇప్పటికైనా ఆ చెట్లను తొలగించి, ఆరోగ్యం కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


జన్నారం: గురువులతో పూర్వ విద్యార్థులు


సబ్బేపల్లి పాఠశాలలో హాజరైన పూర్వ విద్యార్థులు

అ'పూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06వ బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఒకేచోట కలుసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. పాఠశాలను వీడి ఉన్నత చదువులు చదివి వ్యాపారాలు, ఉద్యోగాల్లో, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఈ అపూర్వ సమ్మేళనంతో కలిసి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంబురాల్లో మునిగిపోయారు. ఉపాధ్యాయులు మధుసూధన్, అంజన్న, రామకృష్ణ, లచ్చన్న, ఎల్లయ్య, నహీంపాషా, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలోని శ్రీద్వారకా భారతీ విద్యాలయంలో 2007–08లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలిశారు. చిన్ననాటి తీపి గుర్తులను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమానికి తమకు పాఠాలు బోధించిన గురువులను ఆహ్వానించి, సమ్మేళన కార్యక్రమాన్ని సంతోషంగా జరుపుకున్నారు.

నీడపట్టున ఆటలు!





దండేపల్లి: పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించినప్పటి నుంచి ఆటల్లో మునిగి తేలుతున్నారు. ఎండ సమయంలో ఇంట్లో నీడపట్టున ఆటలాడుతున్నారు. క్యారం, చెస్ ఆడుతూ రోజంతా గడుపుతున్నారు. ఓ చెట్టు నీడన కొందరు చిన్నారులు పందిరి వేసి, దానిపై చెట్ల ఆకులు వేసి, నీళ్లతో ఆడుతున్నారు. ఏం చేస్తున్నారంటే, పందిరి ఆట ఆడుతున్నామని చెప్పారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన


కిష్టంపేట కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట, ఎల్లక్కపేట గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం మంచిర్యాల డీఆర్డీవో కిషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులకు తగిన సూచనలు అందజేశారు. త్వరితగతిన ధాన్యం తరలింపునకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట నిర్వాహకులు, వీఓఏలు సీసీ రవికుమార్, ఆపరేటర్ అశోక్ ఉన్నారు.

సైన్యానికి మద్దతుగా సంఘీభావ ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న యువకులు, నాయకులు

రామకృష్ణాపూర్: దేశ ప్రజల రక్షణ కోసం పాకిస్థాన్‌తో వీరోచిత పోరాటం సాగిస్తున్న సైన్యానికి మద్దతుగా ఆదివారం గద్దెరాగిడిలో ర్యాలీ చేపట్టారు. జాతీయ జెండాలు చేతపట్టుకొని శ్రీనివాసగార్డెన్స్ నుంచి ఎంఎస్‌ఆర్ గార్డెన్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అమాయక ప్రజలను కాల్చి చంపిన ఉగ్రవాదులకు బుద్ధి చెప్పటానికి భారత సైనికులు ప్రాణాలను ఫణంగా పెట్టి ఆపరేషన్ సిందూర్ పేరిట పోరాటం సాగించటం గొప్ప విషయమని జవాన్లకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. క్యాతనపల్లి యువత పాలం లవన్‌కుమార్, సాత్విక్, అజయ్, శివ తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి


మందమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ ఆజాదీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 5న కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలో చేపట్టిన మేలుకొలుపు యాత్ర ఆదివారం మందమర్రికి చేరింది. మందమర్రిలో బీసీ నాయకులతో కలిసి మార్కెట్ ఏరియాలో నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సంజయ్‌కుమార్, బీసీ సంఘం నాయకులు చకినాల శంకర్, శ్రీనివాస్, శేఖర్, మనోహర్, కుమార్, భాస్కర్, గుమ్ముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన సేవలందించాలి


బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ మాజీ వైస్ చైర్మన్

చెన్నూర్: గ్రామీణ ఖాతాదారులకు మెరుగైన బ్యాంక్ సేవలందించాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి అన్నారు. చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాత బస్టాండ్‌లో ఆదివారం ది గాయత్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐ దేవేందర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, బ్యాంక్ రీజినల్ హెడ్ వంశీకృష్ణ, పులిశెట్టి రమేశ్, నర్సగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్, రైల్వేస్టేషన్లో తనిఖీలు


బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో రైల్వేస్టేషన్, బస్టాండ్, పాన్ షాపుల్లో, గంజాయి పాతనేరస్తుల ఇళ్లలో ఆదివారం స్థానిక సీఐ ప్రమోద్‌రావు ఆధ్వర్యంలో నార్కోటిక్ టీమ్స్, నార్కోటిక్ డాగ్స్‌తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి నివారణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, కిరణ్‌కుమార్, నార్కోటిక్ స్పెషల్ టీమ్‌లు పాల్గొన్నాయి.

సందడే.. సందడి..!

కొనసాగుతున్న సమ్మర్‌క్యాంపులు | ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు | విజ్ఞానం, వినోదాన్ని పంచుతున్న వేసవి శిబిరాలు


యోగాసాధన చేస్తున్న విద్యార్థులు

దండేపల్లి: వేసవి సెలవుల్లో విద్యార్థులు కాలక్షేపం కోసం సెల్‌ఫోన్లు, టీవీలకు అతుక్కుపోకుండా ఉండేందుకు, పాఠశాల విద్యాశాఖ ఎంపిక చేసిన పాఠశాలల్లో 15రోజులపాటు వేసవి శిబిరాలు నిర్వహిస్తోంది. ఇందులో విద్యార్థులకు పలురకాల స్కిల్స్‌ను నేర్పిస్తున్నారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 50పాఠశాలలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ నెల 2నుంచి వేసవి శిబిరాలు మొదలయ్యాయి. శిబిరాలకు వస్తున్న విద్యార్థులు ఆడుతూ, పాడుతూ, వివిధ రకాల స్కిల్స్ నేర్చుకుంటూ ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. దీంతో పాఠశాలల్లో సందడి నెలకొంది. విద్యార్థులకు చదువుతో పాటు స్కిల్స్‌పై ఆసక్తి కలిగించేందుకు ఈ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అధికారులు పేర్కొంటున్నారు.

జిల్లాలో ఎంపికైన పాఠశాలలు..

మంచిర్యాల జిల్లాలోని 18మండలాల్లో 50పాఠశాలలు ఎంపిక చేశారు. బెల్లంపల్లి మండలంలో 4, భీమినిలో 1, భీమారంలో 1, చెన్నూర్, దండేపల్లి, హాజీపూర్, జైపూర్, జన్నారం, కాసిపేట, కోటపల్లి, లక్సెట్టిపేట, మందమర్రి, నెన్నెల, తాండూర్ మండలాల్లో 3చొప్పున, కన్నెపల్లి, నస్పూర్, వేమనపల్లి మండలాల్లో 2 చొప్పున, మంచిర్యాల మండలంలో మాత్రం 5చొప్పున పాఠశాలలు ఎంపిక చేశారు.

శిబిరాల నిర్వహణ ఇలా..

- ప్రతీరోజు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు శిబిరాల నిర్వహణ ఉంటుంది.
- ఇందులో యోగా, మెడిటేషన్, ఆర్ట్, క్రాఫ్ట్, నృత్యం, మ్యూజిక్, ఇండోర్‌గేమ్స్, స్పోకెన్ ఇంగ్లిష్, సులభ గణితం వంటి అంశాల్లో మెలకువలు నేర్పిస్తారు. శిల్పకల, ఇలా ఇంకా ఏమైనా స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించినవి కూడా నేర్పించనున్నారు.
- విద్యార్థులకు మెటీరియల్‌తో పాటు రోజుకు రూ.15 విలువ చేసే స్నాక్స్‌ను కూడా అందిస్తున్నారు.
- ఒక్కో పాఠశాలలో శిబిరం నిర్వహణకు రూ.50వేలు వెచ్చిస్తున్నారు. ప్రతీ పాఠశాలలో వంద మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 6నుంచి 9వ తరగతి విద్యార్థులు ఎవరైనా హాజరుకావొచ్చు.
- ప్రతీ పాఠశాలకు అవసరాన్ని బట్టి ముగ్గురు, లేదా నలుగురు వలంటీర్లను నియమించారు. వీరి నియామకం, పర్యవేక్షణ బాధ్యతలను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల బాధ్యులు, పాఠశాలల హెచ్‌ఎంలు చూస్తారు. వలంటీరుకు రూ.3వేల ప్రోత్సాహకమిస్తారు.

విద్యార్థులకు ఎంతో ఉపయోగం..

పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నాయి. ఎందుకంటే, విద్యార్థులు చదువుతోపాటు, వివిధ స్కిల్స్‌పై ఆసక్తి పెరుగుతుంది. శిబిరాలపై విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. చాలామంది హాజరై స్కిల్స్ నేర్చుకోవడంతో పాటు ఆటలు ఆడుతున్నారు. తమ ప్రతిభను కనబరుస్తున్నారు.

\- సత్యనారాయణమూర్తి, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి


చెస్ ఆడుతున్న చిన్నారులు


బొమ్మలు గీస్తూ...


క్రికెట్ ఆడుతూ...

ఎంసెట్ ప్రవేశ పరీక్షలో అభిషేక్ ప్రతిభ

దండేపల్లి: టీజీ ఎంసెట్ ఎంట్రెన్స్‌లో దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన విద్యార్థి తుమ్మ అభిషేక్ ప్రతిభ కనబరిచాడు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో 2245ర్యాంకు సాధించాడు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

చెన్నూర్: పట్టణంలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్స్ క్రీడాకారుల శిక్షణ శిబిరానికి వాకర్స్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేసినట్లు సొసైటీ అధ్యక్షుడు మేకల రామస్వామి తెలిపారు. క్రీడాకారులకు పౌష్టికాహారం కోసం సాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు వాకర్స్ పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

రామకృష్ణాపూర్: పట్టణానికి చెందిన నిరుపేద కుటుంబాలకు గోదావరిఖనికి చెందిన మీసాల సతీష్, మీసాల కళ్యాణ్‌లు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మొత్తం ఆరు కుటుంబాలకు ఒకొక్కరికి రూ.3వేల విలువ చేసే సరుకులు అందించారు. జంతు ప్రేమికుల సంఘ సభ్యులు ఉన్నారు.